క్లుప్తంగా

కొలతల ప్రకారం ఉపాధి పనులు



శివినిలో వేతనదారుల మస్తర్ పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కొమరాడ: ఉపాధి హామీ పథకం పనుల్లో క్షేత్ర సహాయకులు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేయాలని ఎంపీడీఓ ఎల్‌వీ అప్పారావు అన్నారు. మండలంలోని శివిని గ్రామంలో గుండం చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం మస్తర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని వద్ద కచ్చితంగా తాగునీరు పెట్టుకోవాలని సూచించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున పని వద్ద టెంట్లు ఏర్పాటు చేయాలని, రెండు పూటలు పనులు చేయాలన్నారు. ఆయన వెంట ఏపీఓ బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

నీరందేలా మదుములు ఏర్పాటు చేయాలి



తుంబలి వద్ద ఆధునికీకరణ పనులను పరిశీలిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి

జియ్యమ్మవలస: రావాడ వట్టిగెడ్డ రిజర్వాయరు ఆధునికీకరణ పనులలో భాగంగా తుంబలి వద్ద మదుములు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు కోరారు. గురువారం ఆధునికీకరణ పనులను పరిశీలించారు. కుడి ప్రధాన కాలువలో 1వ బ్రాంచ్ కాలువ నుండి సుమారు 200 ఎకరాలకు సాగునీరు అందిందని, అభివృద్ధి పనులలో భాగంగా మూసుకుపోయే ప్రమాదం ఉందన్నారు. అధికారులు దీన్ని గుర్తించి మదుములు ఏర్పాటు చేయాలని కోరారు.

గ్రామ సచివాలయాల సందర్శన



సూచనలిస్తున్న పీఓ నవ్య

సీతంపేట: మండలంలోని పలు గ్రామ సచివాలయాలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.నవ్య గురువారం సందర్శించారు. మండ, హడ్డుబంగి, గొయిది, సోమగండి గ్రామ సచివాలయాలను సందర్శించారు. హాజరు పట్టీ, ఇతర రికార్డులు పరిశీలించారు. ఫేషియల్ యాప్‌లో హాజరు ప్రతీ ఒక్కరూ వేయాలన్నారు. రికార్డులు విధిగా నిర్వహించాలన్నారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బంది యూనిఫాం ధరించాలని, సమయపాలన పాటించాలని సూచించారు.

కంటి పరీక్షలు



కంటి రోగులను పరీక్షిస్తున్న ఆప్తాల్మిస్ట్

వీరఘట్టం: మండలంలోని చిట్టపులివలస జంక్షన్‌లో ఉన్న సత్యసాయి నిత్య అన్నదాన సత్రంలో గురువారం నిర్వహించిన ఉచిత నేత్ర శిబిరంలో 90 మందికి తనిఖీలు చేశారు. విజయనగరం పుష్పగిరి ఆస్పత్రికి చెందిన కంటి వైద్యులు తనిఖీలు చేసి వీరిలో 25 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. శిబిరానికి వచ్చిన వారికి సత్యసాయి భక్తులు భోజన వసతి కల్పించారు.

ఆత్మరక్షణపై అవగాహన



ఆత్మరక్షణపై అవగాహన కలిగిస్తున్న ఎస్‌ఐ రేవతి

పాలకొండ: విద్యార్థినిలు ఆకతాయిల నుంచి తమను తాము రక్షించుకోవడంపై దిశ పోలీసు స్టేషన్ ఎస్‌ఐ రేవతి గురువారం అవగాహన కలిగించారు. పట్టణంలోని వెంకమ్మపేట ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పలు అంశాలను వివరించారు. ఆత్మ రక్షణ, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగించడంతో పాటు లైంగిక వేధింపులపై చైతన్యం కలిగించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, హెచ్‌ఎం పరంకుశంనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతమే లక్ష్యం

గరుగుబిల్లి: నాడు – నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యమని నాగూరు పంచాయతీ సర్పంచ్ కె.శిరీష అన్నారు. మండలంలోని నాగూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు – నేడు పథకంలో మంజూరైన బెంచీలను ఆమె గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీసీసీ గోదాములు, డిపోల

నిర్మాణానికి మోక్షం

- అంచనాలకు సీఎం పేషీ నుంచి ఆదేశాలు
- ఎమ్మెల్యే కళావతి చొరవతో నిర్మాణాలు
- 24 జీసీసీ భవన నిర్మాణాలు, మరమ్మతులకు ప్రతిపాదనలు



మానాపురంలో అర్ధాంతరంగా దశాబ్ద కాలంగా ఆగిపోయిన రేషన్ డిపో భవనం

సీతంపేట: గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోదాములు, రేషన్ డిపోల భవనాల నిర్మాణానికి మోక్షం లభించనుంది. పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి చొరవతో నియోజకవర్గంలో సీతంపేట, భామిని, పాలకొండ, వీరఘట్టం మండలాల్లో రేషన్ డిపోల నూతన భవనాల నిర్మాణాలు, కొన్నింటికి మరమ్మతులకు అంచనాలు వెంటనే రూపొందించి ప్రతిపాదనలు పంపించాలని ముఖ్యమంత్రి పేషీ నుంచి కలెక్టరేట్‌కు ఆదేశాలు వచ్చాయి. దీంతో త్వరలో జీసీసీ భవనాలకు మోక్షం లభించనుంది. గత కొన్నేళ్లుగా జీసీసీ గోదాములు, రేషన్ డిపోలు శిథిలావస్థకు చేరుకోవడంతో నిత్యావసర సరుకులు, బియ్యం వంటివి నిల్వ చేసి సకాలంలో గిరిజన ప్రాంతాల్లో సరఫరా చేయాలంటే ఇబ్బందులు ఉన్నాయని, కొన్ని గ్రామాల్లో భవనాలే లేవని అక్కడ ఇళ్లల్లో నిర్వహించడం జరుగుతుందని గత నెల 10న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ప్రభుత్వం వెంటనే పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి నారాయణ భరత్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు ఒక కాపీ పంపించారు.

ప్రతిపాదించనున్న భవనాలు

పాలకొండ నియోజకవర్గంలో మొత్తం 24 భవనాలు నిర్మించడానికి చర్యలు తీసుకోనున్నారు. దోనుబాయి, సీతంపేటలలో మైనర్ ఫారెస్టు ప్రొడక్ట్స్ నిల్వ చేయడానికి కొత్త భవనాలు, ఎంఎల్ఎస్ పాయింట్, డీఆర్ఎస్ నిల్వ చేయడానికి ఉన్న భవనాలకు మరమ్మతులు చేయాలి. కుశిమి గ్రామంలో ఉన్న భవనానికి మరమ్మతులు, కీసరజోడు, మానాపురం, పొల్ల, సామరెల్లి, వలగెడ్డ, లోకొత్తవలస, సంకిలి, మెట్టూరు, అడ్డంగి, మర్రిగూడలో కొత్త రేషన్ డిపోల భవనాలు నిర్మించాలి. వీటిలో కొన్ని చోట్ల పదేళ్ల కిందట నిర్మించి అర్ధాంతరంగా నిలుపుదల చేశారు. వీటిని పూర్తి చేయాల్సి ఉంది. అడ్డాకులగూడ, చిన్నకంబ, కిల్లాడలలో ఉన్న భవనాలకు రిపేర్లు చేయాల్సి ఉంది. పాలకొండ మండలం బడ్డుమాసింగి, వీరఘట్టం మండలం గంగంపేట, భామిని మండలం ఘనసరలో నూతన భవనాలు నిర్మించాలి. భామినిలో ఉన్న భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో రిపేర్లు చేయాల్సి ఉంది. అన్నింటి నిర్మాణాలు, మరమ్మతులకు గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు రూపొందించనున్నారు.

సీఎం తక్షణం స్పందించారు..



గ్రామాల్లో తాను పర్యటించినపుడు గోదాములు సమస్యలు ఉన్నాయని తెలుసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశాను. ఆయన తక్షణమే స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య త్వరితగతిన పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటాను.

– విశ్వాసరాయి కళావతి, పాలకొండ ఎమ్మెల్యే

ఉగాదికి గృహాలు సిద్ధం చేయాలి



గృహ నిర్మాణాలపై సమీక్షిస్తున్న కమిషనర్ సర్వేశ్వరరావు

పాలకొండ: జగనన్న అర్బన్ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి ఉగాదికి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు కోరారు. పట్టణంలోని సచివాలయాల వార్డు సెక్రటరీలు, వార్డు వలంటీర్లతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడికి సొంతింటి కల నేరవేర్చేందుకు ప్రభుత్వం జగనన్న కాలనీ పేరుతో ఇళ్లు మంజూరు చేసిందని తెలిపారు. ఇందులో సామూహిక గృహ ప్రవేశాలు చేసేందుకు చర్యలు తీసుకుందని వివరించారు. ఇప్పటికే నిర్మాణాలు పూర్తి చేసిన వారికి పూర్తి స్థాయిలో బిల్లులు చెల్లిస్తున్నామని తెలిపారు. లబ్ధిదారులకు అవగాహన కలిగించి స్లాబ్ వేసిన నిర్మాణాలు వెంటనే ప్లాస్టింగ్‌లు, కిటికీలు ఏర్పాటు చేసుకుని ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు.

ఎమ్మెల్సీ ఓటు వినియోగంపై అవగాహన అవసరం



కార్యాలయం ముందు సూచనల బోర్డును ఏర్పాటు చేస్తున్న తహసీల్దార్ సిబ్బంది

కురుపాం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికకు సంబంధించి ఓటు వినియోగంపై పట్టభద్రులు అవగాహన కలిగి ఉండాలని కురుపాం కురుపాం తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్ అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో శాసనమండలి ఎన్నికల్లో ఓటు ఎలా వేయాలి.. ఎలా వేయకూడదన్న దానిపై సూచనల బోర్డును కార్యాలయం ముందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటింగ్ విధానం సార్వత్రిక ఎన్నికలకు భిన్నంగా ఉంటుందన్నారు. బ్యాలెట్‌లో అభ్యర్థుల పేర్లు మాత్రమే ఉంటాయన్నారు. ఓటరు అభ్యర్థి పేరుకు ఎదురుగా అంకెతోనే తమ ఓటు వేయాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల కృషితోనే సంఘాల అభివృద్ధి



వీఓఏల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం కిశోర్

కురుపాం: మండలంలోని వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో ఉన్న మహిళా సంఘాల అభివృద్ధికి వీఓఏలు కృషి చేయాలని ఏపీఎం కిశోర్ సూచించారు. తమ కార్యాలయంలో మండలంలోని ఉన్న వీఓఏలతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు లింకేజీ, పొదుపు, రుణాలు, ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, తదితర అంశాలపై వీఓఏలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రతీ వీఓఏ తమ పరిధిలో ఉన్న మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ, రుణమాఫీ, వడ్డీ తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

వినియోగదారులకు బిల్లులు ఇవ్వాలి



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న మధుసూధనరావు

పాలకొండ రూరల్: ఎరువుల దుకాణాల్లో విత్తనాలు, క్రిమి సంహారక మందులు కొలుగోలు చేసే రైతులకు, వినియోగదారులకు సంబంధిత బిల్లులను తప్పక అందించాలని సాలూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, ఇంటర్నల్ స్క్వాడ్ మధుసూధనరావు అన్నారు. పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో గురువారం తనిఖీలు చేశారు. ఈ క్రమంలో స్టాక్ రికార్డులు, అమ్మకానికి సిద్ధంగా ఉన్న ప్రొడెక్ట్‌ల నాణత్య, వినియోగ తేదీలు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుకాణ యజమానులు అమ్మకాలకు సంబంధించిన వివరాలు ఈ బుక్‌లో పొందుపార్చాలన్నారు. అన్నదాతలకు అందించే విత్తనాలు, ఎరువుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట స్థానిక వ్యవసాయ శాఖ ఏఓ ఎన్ని వాహిని తదితరులున్నారు.

వైభవంగా లక్ష్మీగణపతి కల్యాణం



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: స్థానిక లక్ష్మీగణపతి దేవాలయంలో గురువారం రాత్రి సిద్ధీ బుద్ధీ సమేత లక్ష్మీగణపతి వార్షిక కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేమకోటి సాయికృష్ణశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, ప్రధాన స్తంభ ప్రతిష్ఠ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

పూర్తి సౌకర్యాలు ఏర్పాటు చేయాలి

పాలకొండ రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల వద్ద పూర్తి సౌకర్యాలు కల్పనపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టాలని పాలకొండ సబ్ కలెక్టర్ నురూల్‌కమర్ అన్నారు. స్థానికంగా నిర్ణయించిన పోలింగ్ కేంద్రాలను ఎన్నికల నిర్వహణ సిబ్బందితో కలసి గురువారం ఆయన పరిశీలించారు. ముఖ్యంగా తన కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేయదలచిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ 2వ నంబర్ పోలింగ్ కేంద్రంలో ఓటర్లు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, ఎస్‌ఐ బి.శివప్రసాద్ 23, 24 కేంద్రాల్లో విద్యుత్, భద్రతా ఏర్పాట్లు, మరుగుదొడ్ల, తాగునీటి వసతి కల్పనను పరిశీలించారు.

ప్రజా సహకారంతోనే ఏనుగుల తరలింపు సాధ్యం

వీరఘట్టం: రైతులు, సమీప గ్రామాల ప్రజల సహకారం ఉంటే ఏనుగులను ఇక్కడ నుండి తరలిస్తామని డీఆర్‌ఓ రవిబాబు అన్నారు. ఏనుగులు ఉన్న ప్రాంతాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఏనుగులను చూసేందుకు పెద్ద ఎత్తున జనాలు వస్తుండడంతో ఏనుగులు బెంబేలెత్తిపోతున్నాయన్నారు. ఇటు వైపు ఎవరూ రాకుండా ఉంటే రెండు రోజుల్లో ఏనుగులను తరలిస్తామని డీఆర్‌ఓ అన్నారు.

ఎల్లామ్మ.. కాపాడమ్మా...

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం గ్రామంలో ఎల్లమ్మ పండుగ గురువారం ముగిసింది. మూడు రోజుల పాటు జరిగిన పండుగకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజర్యారు. ఎల్లామ్మ... చల్లంగా చూడమ్మా... అంటూ మొక్కులు చెల్లించుకున్నారు. ఆరోగ్యం ప్రసాదించాలని, పాడి పంటలు కలిసి రావాలని మొక్కుకున్నారు. మంగళవారం ప్రారంభమైన ఈ పండుగలు మూడు రోజుల పాటు ఘనంగా జరిగాయి.

గుమడలో ఫ్యామిలీ డాక్టర్



గుమడలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

కొమరాడ: మండలంలోని కొమరాడ పీహెచ్‌సీ పరిధిలో ఉన్న గుమడ గ్రామంలో వైద్యుడు సీహెచ్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా రోగుల ఇంటికి వెళ్లి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులు ఉంటేనే వాహనాలు తిప్పాలి



వాహనదారులకు సూచనలిస్తున్న ఆర్‌టీఓ శశికుమార్

జియ్యమ్మవలస: అనుమతులు అన్నీ సక్రమంగా ఉన్నవారే వాహనాలను రోడ్డెక్కించాలని ఆర్‌టీఓ శశికుమార్ అన్నారు. వాహనాల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా జియ్యమ్మవలసలో వాహనదారులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. పూర్తి స్థాయిలో అనుమతులు లేని వారిపై అపరాధ రుసుం విధించారు. ట్రాక్టర్లు, వ్యాన్‌లు నడిపేవారు తప్పనిసరిగా రోడ్ ట్యాక్స్ చెల్లించి ఉండాలన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 15 మందిపై అపరాధ రుసుం విధించారు. ఆర్‌టీఏ ఎస్.రమేష్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

దివ్యాంగుడికి పింఛన్ అందజేత

భామిని: మండలంలోని సొలికిరికి చెందిన దివ్యాంగుడు కొత్తకోట రామారావుకు మంజూరైన రూ.5 వేల పింఛన్‌ను బాలేరు ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్ గురువారం అందజేశారు. రామారావు కొన్నాళ్ల కిందట కాలు పొగొట్టుకున్నాడు. దీంతో ఆయనకు దివ్యాంగ పింఛన్ మంజూరైంది. తనకు పింఛన్ మంజూరు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్ కవళిక, వలంటీర్ కె.రేవతి, వైఎస్సార్‌సీపీ గృహ సారథులున్నారు.

యువతతోనే డ్రగ్స్ రహిత సమాజ స్థాపన సాధ్యం

- డీఎస్పీ కృష్ణారావు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

కురుపాం: డ్రగ్స్ రహిత సమాజ స్థాపన యువతతోనే సాధ్యమని పార్వతీపురం మన్యం జిల్లా, పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు అన్నారు. కురుపాం ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా కార్యక్రమంలో భాగంగా కురుపాం ఎస్‌ఐ సి.హెచ్.ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని, వాహనాలను డ్రైవ్ చేసేటప్పుడు అతివేగంగా వెళ్ల రాదని, ర్యాగింగ్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి వంటి చెడు వ్యసనాలు వల్ల జీవితం పాడు చేసుకోవద్దని సూచించారు. ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, కురుపాం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రంలో బోర్డులు



భామిని జెడ్పీహెచ్ఎస్ పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరల్ కమర్

భామిని: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరిగే కేంద్రాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని పాలకొండ సబ్ కలెక్టర్ నూరల్ కమర్ ఆదేశించారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రంగా గుర్తింపు ఉండాలన్నారు. అనంతరం హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడారు. విద్యాబోధన తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మెరుగైన విద్యాబోధన చేయాలని సూచించారు. బురుజోల మెట్ట వద్ద బాలికల రెసిడెన్షియల్ కళాశాల భవన నిర్మాణానికి అవసరమైన స్థల పరిశీలన చేశారు. తహసీల్దార్ నీలాపు అప్పారావు, మండల సర్వేయరు తోట రామ్మోహనరావుతో చర్చించి అవసరమైన ఐదెకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించారు. చిన్నదిమిలి, పెద్దదిమిలిలో గోదాంల నిర్మాణాలను పరిశీలించారు. హెచ్‌ఎం వెంకటరావు, ఆర్‌ఐ ఎస్.రాంబాబు, వీఆర్‌ఓలు గోపాల్, వినోద్‌కుమార్, బత్తిలి ఎస్‌ఐ అమ్మనరావు, డబ్ల్యూపీసీ చందనపట్నాయిక్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



ప్రతిభ కనపర్చిన క్రీడాకారులతో హెచ్‌ఎం, సహోపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

పాలకొండ రూరల్: చదువుతో పాటు క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్ ఉంటుందని భాసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వి.వైకుంఠరావురాజు అన్నారు. ఇటీవల చిత్తూరు జిల్లా నగిరిలో జరిగిన అండర్ – 14 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు చల్లా మహేష్, దీసరి రోహిత్‌లు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా తరపున తలపడి బంగారు పతకాలు సాధించారని హెచ్‌ఎం తెలిపారు. క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులతో పాటు అండర్ –14 ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన మరో క్రీడాకారుడు సలాదుల గణేష్‌ను గురువారం పాఠశాల వేదికపై అభినందించారు. కార్యక్రమంలో పీడీ వాలిలపల్లి దాలినాయుడు, విద్యా కమిటీ అధ్యక్షుడు మండ శ్రీను, శిర్లాపు గురువినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

గరుగుబిల్లి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు విధిగా తీసుకోవాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని కొత్తూరులో అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె గురువారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిర్దేశించిన మెనూ ప్రకారం గర్భిణులకు, బాలింతలకు భోజనం, ఇతర పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. ఆమె వెంట ఎంఈఓ నాగభూషణరావు తదితరులు ఉన్నారు. అనంతరం కొత్తూరు ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలన్నారు. మెనూ సక్రమంగా అమలు చేయకుంటే చర్యలు తప్పవన్నారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంఈఓ నాగభూషణరావు

గరుగుబిల్లి: పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా చర్యలు చేపట్టామని ఎంఈఓ ఎస్.నాగభూషణరావు అన్నారు. మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇష్టపడి చదివితే ఉత్తీర్ణత సాధించడం కష్టమేమీ కాదన్నారు. పరీక్షలకు సమయం ఆసన్నం కానున్న తరుణంలో ప్రణాళిక ప్రకారం ప్రతీ సబ్జెక్టును చదివేలా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా ఆంగ్లం, గణితం, సైన్సు సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయనతో పాటు ప్రధానోపాధ్యాయుడు కొండలరావు తదితరులున్నారు.

ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

వీరఘట్టం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు స్లిప్పులను పట్టభద్రులకు అందజేయాల్సిన బాధ్యత బీఎల్‌ఓలదేనని తహసీల్దార్ చందక సత్యనారాయణ సూచించారు. స్థానిక కార్యాలయంలో బీఎల్‌ఓలతో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 1319 మంది పట్టభద్రులు ఓటు హక్కు కలిగి ఉన్నారని, వీరందరికీ ఓటరు స్లిప్పులు అందజేయాలని సూచించారు. వీరఘట్టం జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

పాలకొండ: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉద్యోగులు నిబంధనలు పాటించాలని సీఐ మురళీధర్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా ఎటువంటి ఘర్షణలకు అవకాశం లేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.